సాక్షి వనపర్తి

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



జోగుళాంబకు జేజేలు

అలంపూర్ జోగుళాంబ అమ్మవారిని శుక్రవారం శాకాంబరిగా అలంకరించనున్నారు.

వివరాలు 8లో ▸



జూరాలకు ఇన్‌ఫ్లో

జూరాలకు 3.08 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా దిగువకు నీటిని వదులుతున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.4 /24.3

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

- 46 మంది బాలకార్మికులకు విముక్తి
- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: చదువుకోవాల్సిన బాలలను పనులకు పంపిస్తున్న ఘటనలను శాశ్వతంగా తగ్గించేందుకు ప్రభుత్వం ఏటా ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తోందని.. జిల్లాలో పదోవిడత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎస్పీ రావుల గిరిధర్ గురువారం తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని.. బాలల హక్కులు, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు పోలీసు, కార్మిక, డీడబ్ల్యూఓశాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 46 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు వెల్లడించారు. ఎవరైన బాలలను పనిలో పెట్టుకున్నా.. ఎక్కడైనా పనిచేస్తున్నా, తప్పిపోయినా, వదిలివేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. బడిఈడు చిన్నారులతో పనులు చేయిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేసేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్..

ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.కిషోర్‌కుమార్ రెడ్డిపై ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు. గత నెల 23, 25 తేదీల్లో సెలవులో ఉన్న సదరు కానిస్టేబుల్ పదర మండలం వంకేశ్వరం గ్రామం నుంచి వస్తూ.. పదర పోలీస్‌స్టేషన్ ఎదుట పోలీసుల తనిఖీల్లో లైసెన్స్ చూపించాలని కోరితే మద్యం మత్తులో వీరంగం సృష్టించడంతో కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. విచారణ అనంతరం గురువారం జైలుకు వెళ్లిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



కొత్తకోట రూరల్: ప్రజలు బ్యాంకుల్లో రుణాలు తీసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆర్‌బీఐ ఎల్‌డీఓ పల్లవి, డీఆర్‌డీఓ ఉమాదేవి కోరారు. గురువారం పెద్దమందడి ఏపీజీవీబీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆర్థిక అక్షరాస్యత' అవగాహన సదస్సుకు వారితో పాటు ఎల్‌డీఎం కౌశల్ కిషోర్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని, మొబైల్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సేవల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. సైబర్ సెక్యూరిటీ గురించి ఖాతాదారులకు వివరించారు. ప్రతి ఖాతాదారు తప్పనిసరిగా నామిని ఉండేలా చూసుకోవాలన్నారు. ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక భద్రత పథకాలైనా పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా చేసుకోవాలన్నారు. మోసపూరిత కాల్స్ నమ్మకూడదని, ఓటీపీలు ఎవరికి చెప్పవద్దని కోరారు. కార్యక్రమంలో డీపీఎం బాషానాయక్, ఏపీఎం నాగమణి, ఏపీజీవీబీ మేనేజర్ జ్ఞానేష్‌గౌడ్, ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్ క్రాంతి, దక్షేశ్వర్‌రెడ్డి, ఎల్‌డీఎం ఆఫీస్ సిబ్బంది సాయికుమార్, ఖాతాదారులు, గ్రామపెద్దలు, బ్యాంకు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంది : ఎమ్మెల్యే

వనపర్తి: ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్‌పార్టీ చిత్తశుద్ధితో ఉందని.. నేటి నుంచి అధికారికంగా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని వర్గీకరణను దృష్టిలో ఉంచుకొని సీఎం ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించినట్లు పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీకి మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిందని.. త్వరలో జారీ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు వివరించారు. అసెంబ్లీలో శుక్రవారం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోనున్నట్లు చెప్పారు.

ఘనంగా ఆరుద్ర పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో ఉన్న దత్త కోటి లింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి ఏకదశ రుద్రాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి శివలింగానికి అభిషేకాలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

వృథాగా ఎత్తిపోతలు

జిల్లాలో నిరుపయోగంగా మారిన చిన్ననీటి పథకాలు



నిరుపయోగంగా ఉన్న నెల్విడి ఎత్తిపోతల పథకం

- నీటి వనరులు ఉన్నా.. అవగాహన లేక ఇబ్బందులు
- ప్రభుత్వం దృష్టి సారిస్తే వేల ఎకరాలు సాగులోకి..
- జిల్లావ్యాప్తంగా 11 లిఫ్టులు మూత

మదనాపురం: వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. విస్తారంగా సారవంతమైన భూములు ఉన్నప్పటికీ వర్షాధారంగానే పంటలు సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పట్లో నిర్మించిన చిన్ననీటి ఎత్తిపోతల పథకాలు నిర్వహణ లేక మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి.

జిల్లావ్యాప్తంగా 19 ఎత్తిపోతలు..

జిల్లాలో 19 ఎత్తిపోతల పథకాలు ఉండగా.. ప్రస్తుతం 8 లిఫ్టులు పాక్షికంగా పని చేస్తున్నాయి. గతంలో ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యత ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించారు. తర్వాత ఆయా గ్రామాల్లోని రైతు కమిటీలకు అప్పగించారు. దీంతో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జూరాల జలాశయం, రామన్‌పాడు, గోపాల్‌దిన్నె, సరళసాగర్, శంకరసముద్రం తదితర వాటి పరిధిలోని ఆయకట్టు మినహాయిస్తే.. మిగతా ఎత్తిపోతల పథకాల నిర్వహణను విస్మరించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణానదిలో నీరు పుష్కలంగా ఉన్నా.. ఎత్తిపోసే పరిస్థితి లేక వేల ఎకరాలకు సాగునీరు అందకుండాపోయింది.

మూతబడిన లిఫ్టులు..

మహబూపాల్ సముద్రం, కంచిరావుపల్లి, రామన్‌పాడు ఫేస్–2, శంకర సముద్రం ఫేస్–1, ఫేస్–2, నాటవల్లి, నాగిరెడ్డిపల్లి, బెక్కరిపల్లి, బాలకిష్టాపూర్, చెల్లెపాడు, నెల్విడి ఎత్తిపోతల పథకం.

ప్రభుత్వానికి నివేదిక అందజేశాం..

జిల్లాలోని జూరాల, గోపల్‌దిన్నె, శంకరసముద్రం, సరళాసాగర్, రామన్‌పాడు జలాశయాల పరిధిలోకి వచ్చే లిఫ్టులను మినహాయించి మిగతా వాటి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– టి.సత్యశీలారెడ్డి, ఎస్‌ఈ, నీటిపారుదలశాఖ, వనపర్తి

మోటార్లు మాయం

ఇప్పటికే కొన్నిచోట్ల ఎత్తిపోతల పథకాల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. మరికొన్ని చోట్ల తుప్పుపట్టి పనికిరాకుండా పోయినట్లు తెలుస్తోంది. ప్రారంభించిన నాటి నుంచి నిర్వహణ సమస్య ప్రధానంగా వెంటాడుతుంది. సిబ్బందిని నియమించకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి మరమ్మతులు చేపట్టినా.. ప్రయోజనం లేకుండా పోయింది. నిర్వహణ బాధ్యత నీటిపారులశాఖ అధికారుల నుంచి రైతులకు అప్పగించడంతో ఈ సమస్య తలెత్తిందని రైతులు చెబుతున్నారు. మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన డబ్బులు కమిటీ దగ్గర లేకపోవడం, అనేక చోట్ల పైప్‌లైన్లు పూర్తిగా ధ్వంసం కావడం.. మొత్తానికి రైతులు, అధికారులు పట్టించుకోకపోవడంతో సాగునీటి పథకాలన్ని ప్రస్తుతం వృథాగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం చిన్న నీటిపారుదలపై దృష్టిసారిస్తే వేల ఎకరాలు సస్యశ్యామలమయ్యే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.



ముళ్లపొదలతో నిండిన శంకరసముద్రం ఫేస్–2 పంప్ హౌజ్ విద్యుత్ సబ్‌స్టేషన్

అర్హులందరికీ రైతుబీమా వర్తింపు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, వివిధ శాఖల జిల్లా అధికారులు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: అర్హత ఉన్న ప్రతిరైతుకు బీమా సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పట్టాదారు పాసు పుస్తకం ఆధారంగా పంట వివరాల నమోదు చేయాలని సూచించారు. ఇంట్లో కూర్చొని నమోదు చేస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో వందశాతం బీమా నమోదుకు అధికారులు ప్రయత్నించాలని కోరారు. మండలాల వారీగా ఎరువుల నిల్వల వివరాలు, పంట రుణమాఫీ ఫిర్యాదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు ఖాతాల్లో పేర్లలో మార్పు తదితర చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీఏఓ సుధాకర్‌రెడ్డి, ఎల్‌డీఎం కౌశిల్ కిషోర్, ఏడీఏ శ్రీనివాస్, ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం–పచ్చదనం విజయవంతం చేయండి..

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పురపాలికలు, గ్రామపంచాయతీల్లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. జిల్లాలో ఐదురోజుల పాటు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు సీఎస్ శాంతకుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయనతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో కార్యక్రమ అమలుకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు.

ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించి రోజువారీ కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. మొదటిరోజు 5వ తేదీన అన్ని గ్రామాలు, పుర వార్డుల్లో సిబ్బంది, కార్యదర్శులు, ఉద్యోగులు, యువత, ప్రజాప్రతినిధులు ర్యాలీలు నిర్వహించాలన్నారు. చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలని, తడి, పొడి చెత్త వేరుచేసి సేంద్రియ ఎరువు తయారు చేసేలా చూడాలని కోరారు. రోడ్లపై గుంతల పూడ్చివేత, కుక్కల నియంత్రణకు శస్త్రచికిత్సలు, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు ఈ కార్యక్రమాన్ని వేదిక చేసుకోవాలని సూచించారు. 300 గజాలు, ఆపైబడి విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకున్న వారు ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత కచ్చితంగా ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, ఆరోగ్యం అంశాలపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేయాలని కోరారు.

ముఖ్యమంత్రి హుందాగా వ్యవహరించాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: సీఎం పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డి ఉన్మాద భాష మాట్లాడటం సరికాదని.. హుందాగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలను గౌరవించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. గురువారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డిని అవమానించే విధంగా అసెంబ్లీలో సీఎం చేసిన వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పాలనపై ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు వ్యతిరేకంగా ఉంటూ రోడ్లపై నిరసనలు వ్యక్తం చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ నిరసనల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎం రాజకీయ ప్రేరేపిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

పుట్టినిల్లు బీఆర్‌ఎస్ అని మరవద్దు..

రాజకీయ ఓనమాలు నేర్పింది బీఆర్‌ఎస్ పార్టీ అనే విషయాన్ని ముఖ్యమంత్రి మరిచిపోవడం దురదృష్టకరమని.. నాడు రాజకీయంగా ఎదుగుదలకు చేయూతనిచ్చిన పార్టీని దూషించడం సరికాదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హితవు పలికారు. రాజకీయాల్లో గెలుపు, ఓటమి సర్వసాధారణమని గుర్తుచేశారు. 2018లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని రేవంత్‌రెడ్డి మాట తప్పారని.. నిండు సభలో మహిళ సభ్యులను అవమానించడం రాష్ట్ర మహిళలను అవమానించిట్లేనన్నారు.

దిష్టిబొమ్మ దహనం..

అసెంబ్లీలో మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డిని అవమానించేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారంటూ గురువారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ మంత్రికి సీఎం క్షమాపణలు చెప్పాలంటూ బీఆర్‌ఎస్ నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకులు అశోక్, తిరుమల్, కంచె రవి, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భీమా కాల్వ చివరి ఆయకట్టుకు నీరందిస్తాం

పాన్‌గల్: భీమా డి–23 కాల్వలో పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని భీమా ప్రాజెక్టు 5వ డివిజన్ ఈఈ కేశవరావు, డీఈ కిరణ్‌కుమార్, ఏఈ దేవరాజు అన్నారు. గురువారం మండలంలోని బుసిరెడ్డిపల్లి సమీపంలో భీమా కాల్వను రైతులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాల్వలో పూడిక తొలగించకపోవడంతో చివరి ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. డి–23 కాల్వ ద్వారా మండలంతో పాటు వీపనగండ్ల మండలం పుల్గరచర్ల, కల్వరాల, సంగినేనిపల్లి, సంపత్రావుపల్లి గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. కాల్వ మరమ్మతు విషయాన్ని జిల్లా అధికారులకు వివరించి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

భీమా కాల్వలను పరిశీలించిన అధికారులు..

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల సమీపంలో ఉన్న భీమా కాల్వకు సక్రమంగా సాగునీరు అందడం లేదన్న రైతుల విజ్ఞప్తి మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం గురువారం భీమా ఈఈ కేశవరావు కాల్వను పరిశీలించారు. మూడేళ్లుగా పూడిక తీయకపోవడంతో కల్వరాల, సంగినేనిపల్లి, వీపనగండ్ల, తూముకుంట తదితర గ్రామాలకు సాగునీరు అందడం లేదని పలువురు రైతులు అధికారులకు వివరించారు. సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ కిరణ్‌కుమార్, ఈఏ దేవరాజు, రైతులు చక్ర వెంకటేష్, వెంకటరాజయ్య, రమేష్‌గౌడ్, తిరుపతయ్య, అఖిల్, ఎల్లస్వామి, రామచంద్ర, నర్సింహ, మద్దిలేటి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కల్వరాలలో రైతులతో మాట్లాడుతున్న భీమా అధికారులు

విద్యార్థులను సిద్ధం చేయాలి

పాన్‌గల్: జాతీయ సాధన సర్వే (న్యాస్) పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి యుగంధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల శిక్షణను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సామర్థ్యాలను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 3వ, 6వ, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న న్యాస్ పరీక్షకు ప్రణాళికతో ముందుకు సాగాలని, ప్రాక్టీస్ పేపర్లతో నిర్వహించే పరీక్షలతో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సారి న్యాస్ పరీక్షలో మండల విద్యార్థులను ముందు నిలిపేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయులు, ఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.



మేమేం చేశాం..

రుణమాఫీ కాని రైతుల ఆవేదన

- అర్హులమైనా ఎందుకు రాలేదని అక్రోశం
- వ్యవసాయ అధికారుల వద్దకు పరుగులు
- బ్యాంకుల చుట్టూ నిత్య ప్రదక్షిణలు
- గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదుల వెల్లువ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రైతు రుణమాఫీలో భారీగా కోతలు పడడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గందరగోళం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో పేరున్నప్పటికీ సాంకేతిక కారణాలు అడ్డంకిగా మారడం.. అర్హులైన వేలాది మందికి జాబితాలో చోటు దక్కకపోవడం రైతులను అయోమయంలోకి నెట్టేసింది. రుణమాఫీ అయిన అన్నదాతల్లో సంతోషం వెల్లివిరుస్తుండగా.. కాని వారిలో మాత్రం నిరాశ అలుముకుంది. అర్హులమైనా ఎందుకు రాలేదంటూ పలు ప్రాంతాల్లో అన్నదాతలు అక్రోశం వెళ్లగక్కుతున్నారు. అటు వ్యవసాయ అధికారులు, ఇటు బ్యాంకుల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టరేట్లలో గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

డీసీసీబీ పరిధిలోనే 30 వేల మందికి మొండిచేయి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) పరిధిలో మొత్తం 68,495 మంది రైతులు రూ.476.84 కోట్ల రుణాలు తీసుకున్నారు. ఇందులో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్నవారు 51,417 మంది రైతులు కాగా.. వీరికి రూ.236.54 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. అయితే 20,130 మంది రైతులకు రూ.92.02 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. అంటే 31,287 మంది రైతుల పేర్లు జాబితాల్లో గల్లంతైనట్లు తెలుస్తోంది. కాగా, రెండో విడతలో రూ.1.50 లక్షల పంట రుణాలకు సంబంధించి 9,478 మంది రైతులకు రూ.67.92 కోట్లు మాఫీ అయ్యాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో అన్ని బ్యాంకుల్లో కలిపి రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న వారిలో కనీసం 70 వేల మందికి రైతు రుణమాఫీ రాలేదని రైతు సంఘాల నాయకులు అంచనా వేస్తున్నారు.

కారణాలివే..

రుణమాఫీ జాబితాలో పెద్దమొత్తంలో రైతుల పేర్లు లేకపోవడంపై జిల్లా అధికారులను ప్రశ్నిస్తే.. ప్రతి ఒక్కరూ అస్పష్టంగానే సమాధానం ఇస్తున్నారు. తమకు రాష్ట్ర ప్రభుత్వం నుంచే అర్హుల జాబితా వచ్చిందని.. ఏమైనా లోపాలుంటే సరి చేస్తామని చెబుతున్నారు. ప్రధానంగా డీసీసీబీ పరిధిలో రుణాలు తీసుకున్న రైతుల్లో సగం మంది పేర్లు అర్హుల జాబితాలో లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీసీసీబీ బ్రాంచ్‌లతో పాటు బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు చేసిన తప్పిదాల వల్లే రుణమాఫీ కాలేదని రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రీవెన్స్‌సెల్‌కు అందిన ఫిర్యాదులను పరిశీలిస్తే ఆధార్ నంబర్ల తారుమారు, ఆధార్, బ్యాంక్ ఖాతాల్లో పేర్లు సరిపోలకపోవడం, పాన్ కార్డులో తప్పులు, బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ లేకపోవడం, రేషన్‌కార్డులో పేరు చూపకపోవడం, ఫ్యామిలీ గ్రూపింగ్, సంతానం పేరిట పట్టా భూములు మార్చడం వంటి కారణాలతో రుణమాఫీ జాబితాలో పేర్లు లేకుండా పోయినట్లు తెలుస్తోంది.


గ్రీవెన్స్‌సెల్‌కు అందిన ఫిర్యాదులు..

జిల్లా	ఫిర్యాదులు
మహబూబ్‌నగర్	660
నాగర్‌కర్నూల్	650
వనపర్తి	600
జోగుళాంబ గద్వాల	593
నారాయణపేట	270

జిల్లాల వారీగా రుణమాఫీ అమలు ఇలా..(రూ.కోట్లలో..)

జిల్లా	మొదటి విడత		రెండో విడత	
	రైతులు	మాఫీ	రైతులు	మాఫీ
మహబూబ్‌నగర్	36,406	200.97	25,189	215.44
జోగులాంబ గద్వాల	24,398	144.09	15,472	174.73
నాగర్‌కర్నూల్	46,780	265.21	30,501	297.12
నారాయణపేట	27,774	160.36	17,780	186.41
వనపర్తి	27,066	145.55	16,527	154.58


పంట రుణమాఫీ కాలేదు..



మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో నేను రూ.45 వేలు, నా భార్య రూ.65 వేల పంట రుణం తీసుకున్నాం. ఇద్దరి మొత్తం రుణం రూ.1.10 లక్షలే ఉన్నా.. రుణమాఫీ వర్తించలేదు. ఇదేమిటని బ్యాంకు అధికారులను అడిగితే.. పేర్లు తప్పుగా ఉన్నాయి, సరిచేసిన తర్వాత మాఫీ అవుతుందని చెబుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

– లింగస్వామి, ఖిల్లాఘనపురం

ఆగస్టు 15లోపు మాఫీ అంటున్నారు..



మా అమ్మ పేరున రెండెకరాల పొలం ఉంది. రూ.80 వేల పంట రుణం తీసుకున్నాం. ఇప్పటి వరకు రెండు విడతల్లో మాఫీ వచ్చినా.. మాకు వర్తించలేదు. ఇదేమిటని బ్యాంకు అధికారులు, వ్యవసాయశాఖ అధికారులను అడిగితే ఆగస్టు 15లోపు మాఫీ అవుతుందని చెప్పారు. అధికారులు స్పందించి రుణమాఫీ వర్తింపజేయాలి.

– విష్ణు, గోపాల్‌పేట

మాఫీ అయినా తప్పని తిప్పలు..

- మొదటి విడతలో రూ.లక్షలోపు రుణమాఫీ అయినప్పటికీ పలువురు రైతుల బ్యాంక్ ఖాతాల్లో మాఫీ సొమ్ము జమకాలేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో పుట్టిన తేదీ, ఆధార్ కార్డుల నంబర్ తారుమారుతో 1,298 మంది రైతులకు ఇబ్బందులు ఎదురైనట్లు అధికారులు చెబుతున్నారు. వీరికి రూ.6.50 కోట్లు జమ కావాల్సి ఉంది.
- జోగుళాంబ గద్వాల జిల్లాలో అకౌంట్ నంబర్లలో దొర్లిన తప్పులు, ఇతరత్రా కారణాలతో 177 మందికి రుణమాఫీ పెండింగ్‌లో ఉంది.
- నారాయణపేట జిల్లాలో 319 మంది రైతులకు సంబంధించి వారి వారి బ్యాంక్ ఖాతాల్లో మొత్తం రూ.1.39 కోట్లు జమ కావాల్సి ఉంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ దుర్మరణం


మధు (ఫైల్)

పెబ్బేరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతిచెందిన ఘటన పెబ్బేరు మోడల్ స్కూల్ సమీపంలో ఎన్‌హెచ్ – 44పై గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. పెబ్బేరుకు చెందిన ఫొటోగ్రాఫర్ సులిగిరి మధు (23) వై.శాఖాపూర్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌లో ఫొటోలు తీసేందుకు వెళ్లాడు. ఫంక్షన్ ముగిసిన అనంతరం బైక్‌పై పెబ్బేరుకు వస్తుండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో మధుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

భూత్పూర్: మున్సిపాలిటీలోని సిద్ధాయిపల్లి డబుల్ బెడ్రూంల వద్ద ఓ వృద్ధుడు అనుమానాస్పదంగా మృతిచెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అమిస్తాపూర్‌కి చెందిన కటికె శంకర్ (60)కు సిద్ధాయిపల్లి వద్ద డబుల్ బెడ్‌రూం ఇల్లు రావడంతో అక్కడే నివాసం ఉంటున్నారు. కాగా అతడి భార్య కమలబాయి, కుమారుడు గత నెల 27న బోనాల పండుగకి మటన్ అమ్మడానికి మహబూబ్‌నగర్ వెళ్లారు. ఆ తరువాత వారు అక్కడే నివాసం ఉండే కుమార్తె ఇంటికి వెళ్లారు. అయితే నాటి నుంచి శంకర్ సిద్ధాయిపల్లిలోని ఇంట్లోనే ఉన్నాడు. కాగా గురువారం అతడి ఇంట్లో కుళ్లిన వాసన వచ్చింది. దీంతో చుట్టుపక్కల వారు వెళ్లి చూశారు. వారికి శంకర్ మృతదేహం రక్తం మడుగులో కుళ్లిపోయి కన్పించింది. దీంతో వారు అతడి కుమారుడు మహేష్‌ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మహేష్ ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ వివరించారు.

కృష్ణానదిలో వ్యక్తి గల్లంతు

దోమలపెంట: కృష్ణానదిలో వ్యక్తి గల్లంతైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈగలపెంట ఎస్‌ఐ.వీరమల్లు తెలిపిన సమాచారం ప్రకారం.. అమ్రాబాద్ పరిధిలోని శ్రీశైలం ఆనకట్ట దిగువన పాతాళగంగ ఎడమ గట్టు పుష్కర ఘాట్ వద్ద గురువారం ఘటన జరిగింది. నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన ఎస్.యాదయ్య(60) ఘాట్ వద్ద తన స్నేహితులతో కలిసి స్నానమాచరిస్తూ ప్రమాదవశాత్తు నదిలో కొట్టుకుని పోయాడు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం వేగంగా ఉండడంతో మత్స్యకారులకు సమాచారం ఇచ్చామని ఎస్‌ఐ వివరించారు. యాదయ్యకు సంబంధించి ఆచూకీ లభిస్తే తెలపాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఐటీడీఏ వద్ద ఆదివాసీ చెంచుల ఆందోళన

మన్ననూర్: కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆదివాసీ చెంచులు నిర్వహించ తలపెట్టిన చలో అసెంబ్లీ పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయం నుంచి అసెంబ్లీ వరకు నల్లమల ఏజెన్సీ పరిసర ప్రాంత ఆదివాసీ చెంచులు పాదయాత్ర చేపట్టేందుకు సిద్ధం కాగా.. అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఆదివాసీ చెంచులతో మాట్లాడారు. ఈ నెల 11 లేదా 12వ తేదీన చెంచు నాయకులతో సమావేశం నిర్వహించి, సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ఆదివాసీ చెంచుల 31 డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే చెంచులకు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు రాత్రివేళ నిద్రించేందుకు చెంచులక్ష్మి రెస్టారెంట్ వద్ద గదులు, బాత్‌రూంలు తదితర వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. కాగా, ఆదివాసీ చెంచుల ఆందోళన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా సీఐ శంకర్ నాయక్, ఎస్‌ఐ రమేష్ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం తమ పాదయాత్రను వాయిదా వేస్తున్నట్లు ఆదివాసీ హక్కుల సంఘం నాయకుడు మల్లికార్జున్ ప్రకటించారు. కార్యక్రమంలో చెంచు నాయకులు చిగుర్ల మల్లికార్జున్, తిరుపతయ్య, లింగయ్య, బయ్యన్న పాల్గొన్నారు.


ఆదివాసీ చెంచులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రోహిత్‌రెడ్డి

జోగుళాంబకు జేజేలు


జోగుళాంబ క్షేత్రంలో కూరగాయలతో హారం తయారు చేస్తున్న భక్తులు

- నేడు అలంపూర్ క్షేత్రంలో శాకాంబరి ఉత్సవాలు
- ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి
- శాకాంబరిదేవిగా దర్శనం ఇవ్వనున్న అమ్మవారు

జోగుళాంబ శక్తిపీఠం: ఆషాఢమాసం చివరి శుక్రవారం సందర్భంగా అలంపూర్ జోగుళాంబ క్షేత్రంలో శాకాంబరి ఉత్సవాలు నిర్వహించనున్నారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరుద్రోత్సవం, మాస శివరాత్రి, చండీ హోమాలు, రుద్రహోమాలు, అన్నాభిషేకాలతో అలంపూర్ క్షేత్రం వేదఘోషతో మార్మోగనుంది. నవబ్రహ్మ ఆలయాలన్నీ ఓంకారాన్ని ప్రతిధ్వనించనున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే శుక్రవారం తుంగాతీరం పులకరించేవిధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, డ్రైఫ్రూట్స్‌తో అలంకరించేందుకు భక్తులు సేవలందిస్తున్నారు.

పూజా కార్యక్రమాలు ఇలా..

ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో గోపూజ, గో సహితంగా ఆలయ ప్రాకార మండపంలో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రదక్షిణలు నిర్వహిస్తారు. ఆలయంలో కొలువుదీరిన సంకల్పసిద్ధి గణపతికి ప్రత్యేకంగా పంచామృతాలతో అభిషేకాలు చేస్తారు. అనంతరం వేదపండితులతో మహాన్యాస పారాయణం నిర్వహించనున్నారు. అదేవిధంగా గర్భాలయంలో కొలువుదీరిన బాల బ్రహ్మేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకాల పేరిట 11 అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించి, లింగాకృతిలో అలంకరణ, మహా నివేదన, దశవిధ హారతులు సమర్పిస్తారు. మరోవైపు మాస శివరాత్రిని పురస్కరించుకొని రుద్రహోమాలు, జోగుళాంబ ఆలయంలోని యాగశాలలో చండీహోమాలు నిర్వహిస్తారు. జోగుళాంబ అమ్మవారి వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిదేవిగా అలంకరించి ఆరాదిస్తారు. ఈ సమయంలో అమ్మవారికి జరిగే త్రిశతి, ఖడ్గమాల అర్చనలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. ప్రదోష కాలంలో ఆలయంలో రథోత్సవాన్ని నిర్వహించి దశవిధ హారతులు సమర్పిస్తారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

చాలా మంచి రోజు..



ఆరుద్రోత్సవం, ఆషాఢ చివరి శుక్రవారం, మాస శివరాత్రి, చండీ హోమాలు, రుద్రహోమాలు, అన్నాభిషేకాలు, శాకాంబరి అలంకరణ ఇలా అన్నీ ఒకే రోజు కలిసి రావడం ఎంతో విశేషం. ఇలాంటి సందర్భంలో అమ్మవారు, స్వామివారిని దర్శించడం, పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావించాలి.

– ఆనంద్ శర్మ, ప్రధాన అర్చకుడు, జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయం

అన్ని ఏర్పాట్లు చేశాం..



అమ్మవారికి నిర్వహించే విశేష పూజలు, అలంకరణలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని భావిస్తున్నాం. అందుకు తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు ప్రశాంత వాతావరణం కల్పించాం. భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నాం.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

ప్రకృతిని ఆరాదించడమే..



అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించడమనేది ప్రకృతి మాతను ఆరాదించడమే. ప్రకృతిలో లభ్యమయ్యే కూరగాయలను ఆ తల్లికి సమరించి, వాటిలో దాగి ఉన్న ఆరోగ్య సూత్రాలు చాటి చెప్పడమే. అందరికీ చక్కని ఆరోగ్యం, అంతా సస్యశ్యామలం కలగాలని చేసే ప్రత్యేక ఆరాధన ఇది.

– బండి శ్రీనివాస్, జోగుళాంబ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

పాలమూరుకు రెండో విజయం


విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా తదితరులు

- హైదరాబాద్ బ్లూస్‌పై 8 వికెట్ల తేడాతో గెలుపు
- హెచ్‌సీఏ ఏ–1 డివిజన్ త్రీ డే లీగ్ చాంపియన్‌షిప్

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ ఏ–1 డివిజన్ త్రీ డే లీగ్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లా జట్టు రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. హైదరాబాద్ బ్లూస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. హైదరాబాద్‌లోని త్యాగి క్రికెట్ మైదానంలో 7 వికెట్లు కోల్పోయి 186 ఓవర్ నైట్ స్కోర్‌తో గురువారం బ్యాటింగ్‌ను కొనసాగించిన జిల్లా జట్టు 76.5 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో తొలి ఇన్నింగ్‌లో 94 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్ ప్రారంభించిన హైదరాబాద్ బుల్స్ జట్టు జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 29.1 ఓవర్లలో 123 పరుగులకే కుప్పకూలింది. శ్రీకాంత్ యాదవ్ 9 ఓవర్లలో 26 పరుగులు ఇచ్చి 4 వికెట్లు, షాదాబ్ అహ్మద్ 9 ఓవర్లలో 28 పరుగులకు 4 వికెట్లు, గణేష్ 2.1 ఓవర్లలో 16 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశారు.అనంతరం 30 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన జిల్లా జట్టు 8.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. అబ్దుల్ రాఫే 12 పరుగులు, గణేష్ 10 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

ఎండీసీఏ అభినందనలు

ఉమ్మడి జిల్లా జట్టు త్రీ డే లీగ్‌లో రెండో విజయాన్ని సాధించడంపై మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (ఎండీసీఏ) ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా హర్షం వ్యక్తం చేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా జట్టు రెండో విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన జట్టు సభ్యులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న లీగ్ మ్యాచుల్లో మరిన్ని విజయాలు నమోదు చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

తగ్గిన విద్యుత్ ఫిర్యాదులు

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఫారూఖ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించిన ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) ముషారఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. 2023 జనవరి–జూన్ మధ్యకాలంలో 5,83,672 ఫిర్యాదులు రాగా, ఈ ఏడాది ఇదే కాలవ్యవధిలో 3,97,934 ఫిర్యాదులు అందినట్టు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 31.82 శాతం ఫిర్యాదులు తగ్గినట్టు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా 2023 జనవరి–జూన్ మధ్యకాలంలో 35,949 ఫిర్యాదు రాగా, ఈ ఏడాది ఇదే కాల వ్యవధిలో 60.96 శాతం తగ్గుదలతో 14,035 ఫిర్యాదులొచ్చాయని అన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు, 1912 టోల్ ఫ్రీ నెంబర్ కాల్ సెంటర్ పనితీరుపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించేందుకు గాను 1912 టోల్ ఫ్రీ కాల్ సెంటర్‌తో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటున్నామని తెలిపారు. 213 ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ల కార్యాలయాల సిబ్బంది ఉపయోగించే వాహనాల్లో యాప్ ఆధారిత జీపీఎస్ సాంకేతికను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది సంబంధిత ప్రాంతానికి చేరుకుని సత్వర చర్యలు తీసుకుంటున్నారా? లేదా? అనే అంశంపై సమీక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లింగ్ ఫిర్యాదులు, బ్రేక్ డౌన్ సమాచారం, ఫీడర్ల సమాచారం, బిల్లింగ్/ కలెక్షన్ సమాచారం వంటి వివరాలతో కూడిన సమీకృత డాష్ బోర్డును అందుబాటులోకి తెచ్చామని, దీని వలన రియల్ టైంలో సమాచారం తెలుసుకునే వీలుంటుందన్నారు. 1912 టోల్ ఫ్రీ నెంబర్‌తో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో 74 మంది సుశిక్షిత ఆపరేటర్లను అందుబాటులో ఉంచి బలోపేతం చేశామన్నారు. ఏకాలంలో 400 ఫిర్యాదులు స్వీకరించే రీతిలో సామర్థ్యం పెంపొందించామన్నారు. ఫిర్యాదుదారులకు కంప్లైంట్ నంబర్ సైతం ఎస్ఎంఎస్ ద్వారా పంపిస్తామన్నారు.

అల్పాహారం వికటించి.. 20 మంది విద్యార్థినులకు అస్వస్థత

- వాంతులు, కడుపులో వికారంతో ఇబ్బందులు
- నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల ఆశ్రమ పాఠశాలలో ఘటన


అస్వస్థతకు గురైన కొందరు విద్యార్థినులు

లింగాల: అల్పాహారం వికటించి పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చోటు చేసుకుంది. స్థానిక పాఠశాలలో దాదాపుగా 300 మంది వరకు విద్యార్థినులు ఉన్నారు. ఉదయం అల్పాహారంగా పులిహోర వడ్డించగా.. అది తిన్న గంట తర్వాత 20 మంది విద్యార్థుల వరకు వాంతులు చేసుకున్నారు. మరికొందరికి కడుపులో వికారంతో ఇబ్బందులు పడ్డారు. ఇందులో ఏడో తరగతికి చెందిన దివ్య, లక్ష్మి, శిరి, శ్రీలత, సంజన, అఖిల, పావనితో పాటు మరికొందరు తీవ్ర అస్వస్థతకు గుర్త్రై వాంతులు చేసుకున్నారు. వీరికి వెంటనే ఓఆర్ఎస్ తాగించడంతో పాటు కొందరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో డిశ్చార్జి చేశారు. కాగా.. విద్యార్థినులకు ఇచ్చిన అల్పాహారంలో మోదాదుకు మించి నిమ్మ ఉప్పును కలపడం వల్ల ఇలా జరిగిందని తెలిసింది. అయితే విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంగతి తెలుసుకున్న తల్లిదండ్రులు ఆశ్రమ పాఠశాలకు రావడంతో ఈ విషయం బయటికి వచ్చింది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడే తాగునీటి వసతి లేకపోవడంతో తరచుగా మిషన్ భగీరథ నీటిని తాగుతూ అనారోగ్యాలకు గురవుతున్నట్లు తెలుస్తుంది. ఈ సంఘటనపై వివరణ కోసం ప్రయత్నించగా వార్డెన్ అందుబాటులో లేరు.

జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌గా అంజనీదేవి



జోగుళాంబ శక్తిపీఠం: ఉమ్మడి పాలమూరు జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా అంజనీదేవి గురువారం నియమితులయ్యారు. ఇక్కడి సహాయ కమిషనర్ గాదిరాజు శ్రీనివాసరాజు హైదరాబాద్ జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయానికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారిగా ఉన్న అంజనీదేవి ఇక్కడికి వచ్చారు.

గంజాయి నిందితులకు రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. జిల్లా కేంద్రానికి సాబేర్‌తో పాటు మరో మైనర్ బాలుడు బుధవారం అనుమానాస్పదంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సంచరిస్తుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీలు చేపట్టారు. వారి నుంచి 15 గంజాయి పాకెట్లు లభించగా.. స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో గంజాయిని హైదరాబాద్ దూల్‌పేట నుంచి తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదుచేసి, కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాగితాల్లోనే అంధుల సంక్షేమం


మాట్లాడుతున్న పానుగోటి చొక్కరావు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వాలు ఎన్ని మారినా అంధుల సమస్యలు పరిష్కరించడం లేదని ఆల్ ఇండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ జాతీయ ఉపాధ్యక్షుడు పానుగోటి చొక్కరావు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అంధుల సంక్షేమం కేవలం కాగితాలకే పరిమితమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు హక్కుల చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అంధుల కోసం స్వతంత్ర రాష్ట్ర కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అంధ విద్యార్థులకు 3 భాషలను తప్పనిసరి చేయలని అన్నారు. వైన్ షాపుల కేటాయింపులో అంధులకు ఒక్క శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ, జీవిత పన్ను మినహాయించాలని కోరారు. ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత, అంధ పాఠశాల అభివృద్ధి వంటివి చేపట్టాలన్నారు. అంధ మేధావులకు ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యత్వాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంధుల సమస్యల కోసం తమ సంఘం పని చేస్తుందని ఏమైనా.. ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని కోరారు. జాతీయ కోశాధికారి పరమేశ్, నాయకులు దామోదర్‌రావు, రాములు పాల్గొన్నారు.

గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జితేందర్‌రెడ్డి


గవర్నర్‌కు జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జితేందర్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఢిల్లీకి వచ్చిన జిష్ణుదేవ్‌వర్మతో.. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

జూరాలకు 3,08,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 42 క్రస్టు గేట్ల ద్వారా 2,80,909 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల


జూరాల ప్రాజెక్టు నుంచి 42 క్రస్టుగేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు/ఆత్మకూర్: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది. ప్రాజెక్టుకు 3,08,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. 42 క్రస్టు గేట్లను ఎత్తి 2,81,514 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు చెప్పారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 18,557 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. జూరాల 42 క్రస్టుగేట్ల ద్వారా 2,81,514 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45, కుడి కాల్వకు 658, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, కోయిల్ సాగర్‌కు 630, భీమా–2కు 750, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,03,674 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అదేవిధంగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 3,41,111 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 3,50,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 3,35,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 30 గేట్లు ఎత్తి 3,25,838 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

జూరాల ఎగువ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపడుతున్నట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. వరద ఉధృతి అధికంగా ఉన్న నేపథ్యంలో దిగువ జూరాలలో విద్యుదుత్పత్తి చేపట్టలేక పోతున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 70.639 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద

శాంతినగర్: ఎగువన కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం సాయంత్రం సుంకేసుల బ్యారేజీకి 1,50,600 వరద వచ్చింది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 1.235 టీఎంసీలు కాగా (292 మీటర్లు).. 289 మీటర్ల నీటిని నిల్వ చేస్తూ 28 గేట్లు ఎత్తి 1,47,380 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదిలోకి, 2,354 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేస్తున్నట్లు బ్యారేజీ అధికారులు తెలిపారు.

కృష్ణానదిపై అంతర్రాష్ట్ర బ్రిడ్జి నిర్మాణానికి చొరవ చూపాలి

- ఏపీ సీఎం చంద్రబాబుకు విన్నవించిన అచ్చంపేట ఎమ్మెల్యే


ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట/దోమలపెంట: తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణానదిపై చేపట్టనున్న మద్దిమడుగు బ్రిడ్జి నిర్మాణంపై ప్రత్యేక చొరవ చూపాలని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. గురువారం శ్రీశైలం ప్రాజెక్టు వద్ద నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ సీఎంను స్థానిక ఎమ్మెల్యే కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్దిమడుగు – మాచర్ల బ్రిడ్జి ఏర్పాటుతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర మధ్య రాకపోకలు కొనసాగుతాయన్నారు. ఫలితంగా ఏపీ రాజధాని అమరావతి, మాచర్ల, గుంటూరు, విజయవాడ మధ్య సంబంధాలు బలపడతాయని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణంపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా శ్రీశైలం దేవస్థానం పాలక మండలిలో అచ్చంపేట ప్రాంతానికి అవకాశం కల్పించాలని కోరారు. శ్రీశైలంలో తెలంగాణ అతిథిగృహ నివాసానికి స్థలం కేటాయించాలని, నల్లమల ప్రాంతంలోని చెంచులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

బైక్‌పై ఏడుగురు.. 236 కి.మీ. ప్రయాణం


ఒకే బైక్‌పై ఈశ్వర్ సహా ఏడుమంది..

మరికల్: ఓ వ్యక్తి సహా ఒకే బైక్‌పై ఏడు మంది ప్రయాణం చేయడం మండల పరిధిలో గురువారం పలువురి ఆశ్చర్యానికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే..ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మిగనూర్‌కు చెందిన ఈశ్వర్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో షాద్‌నగర్‌లో స్థిరపడి వ్యాపారం చేసుకుంటున్నాడు. గురువారం సొంత గ్రామానికి బైక్‌పై కుటుంబంతో కలిసి బయలుదేరారు. మార్గ మధ్యలో మరికల్ వద్ద ఆగారు. ఈ క్రమంలో వారి బైక్‌పై ఒకేసారి ఏడు మంది వెళ్తుండాన్ని పలువురు ఆశ్చర్యంగా తిలకించారు. కాగా ఈశ్వర్ బైక్‌కు ఇరువైపులా ఇనుప బుట్టీల మాదిరిగా ఏర్పాటు చేసి అందుల్లో అటూ ఇటూ ఇద్దరు పిల్లలను కూర్చొపెట్టాడు. అదేవిధంగా ఒకేసీటుపై మరో ముగ్గురు పిల్లలు, భార్యతో పాటు ఈశ్వర్ కూర్చున్నారు. ఆరాతీయగా షాద్‌నగర్ నుంచి 236 కి.మీ దూరంలో ఉన్న ఎమ్మిగనూర్‌కు వెళ్తున్నట్లు తెలిసింది.